క్లుప్తంగా

అట్టహాసంగా వికసిత్ ఫెస్ట్



నున్న(విజయవాడరూరల్): గ్రామంలోని వికాస్ విద్యాసంస్థల్లో శుక్రవారం వికసిత్ ఫెస్ట్-2కే23 అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, రోబోరేస్ తదితర పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల వైస్ చైర్మన్ ఎస్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ బి.రమణ, రామ్మోహనరావు, కిషోర్ బాబు, వికసిత్ కన్వీనర్లు బి.వి.రెడ్డి, బి.సురేష్ పాల్గొన్నారు.

30 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి వెలుగుతో వృద్ధుల కంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కందలంపాడు సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు అన్నారు. మండలంలోని కందలంపాడులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు నిండిన 30మంది వృద్ధులకు శుక్రవారం ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు అందించారు. వైద్య సిబ్బంది బేబీ, మోహన రూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం



పెనమలూరు: మండలంలోని కానూరులో వేంచేసి ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం ఐదో వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. మాజీ సర్పంచ్‌లు అన్నే సుజాత, అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి దంపతుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. శుక్రవారం గ్రామోత్సవం, పవళింపుసేవ, అన్నసమారాధన చేశారు.

ట్యాంకులతో తాగునీటి సరఫరా



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో శుక్రవారం ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద జరుగుతున్న మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపించి వాటర్ ట్యాంకులను రప్పించారు. ఈ ట్యాంకుల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేశారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని పునాదిపాడు గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు కోడి పుంజులు, పది బైక్‌లు, 18 కోడి కత్తులు, రూ.3600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెనమలూరు: విజయవాడ-అవనిగడ్డ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడటంతో పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన టి.చైతన్య విజయవాడ ఆటోనగర్‌లో పని చేస్తాడు. రోజూ బైక్ ఆటోనగర్ వచ్చి వెళ్తాడు. ఈ క్రమంలో అతను గురువారం బైక్‌పై కరకట్ట మీదగా ఇంటికి వెళ్తుండగా పెదపులిపాక వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన చైతన్యను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి తండ్రి సుబ్బారావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రసాదంపాడులో అభివృద్ధి పరుగులు

- ఇప్పటికే పలు అంతర్గ రోడ్ల నిర్మాణం పూర్తి
- రూ.1.90 కోట్లతో మరికొన్ని అభివృద్ధి పనులు


రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో ఆశించిన స్థాయిలో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం జరగక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాలకుల చొరవతో గ్రామంలో చాలా వరకు అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తయింది. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి అభివృద్ధి చేశారు. మరికొన్నింటిని అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే పంచాయతీ నిధులు రూ.70 లక్షలతో పలు అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలోని అంతర్గత రహదారిని రూ.15 లక్షలు, మరో రూ.4 లక్షలతో వాటర్ పైప్‌లైన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. సచివాలయం-2 వెనుక రూ.21 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. రూ.10 లక్షలతో రైల్వేకట్ట రోడ్డు, రూ.30 లక్షలతో బీఎంపీఎస్ పక్క రోడ్డు, హైటెన్షన్ వైర్ల కింద 80 అడుగుల రోడ్డులో రూ.60 లక్షలతో సీసీ డ్రెయిన్లు అభివృద్ధి చేశారు. దాతల సహకారంతో ఈ రహదారిని గ్రావెల్‌తో అభివృద్ధి చేశారు.

ఎమ్మెల్యే వంశీ చొరవతో..

గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో పంచాయతీ, మండల నిధులతో గ్రామంలో త్వరలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులకు రూ.1.90 కోట్లతో అంచనాలు రూపొందించారు. ప్రధానంగా కోటి రూపాయలతో డ్రెయిన్లు, అంతర్గత రహదారులను నిర్మించేందుకు తీర్మానం చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న హిందూ శ్మశాన వాటికలో రూ.25 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తికావచ్చాయి. యాదవుల బజార్‌లో అంతర్గత రహదారి, డ్రెయిన్, వాటర్ పైప్‌లైన్ ఆధునికీకరణకు రూ.కోటి, రైవస్ కాలువ రోడ్డు నిర్మాణానికి మరో రూ.30 లక్షలతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు పంపించారు. గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ గట్టు ప్రాంతాలు, ప్రధాన గ్రామంలో అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందడంతో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ గంగారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు (ఫైల్)



సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డు

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి

గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధాన గ్రామంతో పాటు కాలువ గట్టు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశాం. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టిసారిస్తున్నాం. కృష్ణావాటర్ విజయవాడ కార్పొరేషన్ పరిధి వరకే అందుతోంది. ఈ నీటిని పైప్‌లైన్ల ద్వారా గ్రామానికి తీసుకొచ్చి సురక్షిత తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

– సర్నాల గంగారత్నం, సర్పంచ్, ప్రసాదంపాడు



నూరు శాతం పన్నులు వసూలు చేయాలి : డీపీఓ

కంకిపాడు: నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలని పంచాయతీ కార్యదర్శులను డీపీఓ నాగేశ్వర నాయక్ ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా పన్నులు డిమాండ్, పన్ను వసూళ్ల ప్రగతిపై సమీక్షించారు. డీపీఓ నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా రూ.5.58 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ రూ.2.52 కోట్లు వసూలయ్యాయని వివరించారు. రోజు వారీగా లక్ష్యం నిర్ణయించుకుని పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పన్నులను వసూలు చేయాలన్నారు. పన్ను వసూళ్లలో జాప్యం, నిర్లక్ష్యం వహించినట్లు తన దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఈఓఆర్‌డీ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న డీపీఓ నాగేశ్వర నాయక్

సమర్థంగా అంతర్గత రహదారుల అభివృద్ధి

కంకిపాడు: అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు సమర్థంగా జరుగుతున్నాయని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. మండలంలోని పునాదిపాడు ఎస్సీ కాలనీలో పంచాయతీ సాధారణ నిధులు రూ.7.85 లక్షలతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రాధాన్యతాక్రమంలో గ్రామంలో మౌలిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. గ్రామ పర్యటనలో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా నిధులు కేటాయింపులు జరిగేలా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. నిధులు సద్వినియోగం అయ్యేలా, మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముసిబోయిన మోహనకృష్ణ, పిడికిటి మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ రామచంద్రరావు, సచివాలయ ప్రతినిధులు

విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి

డీఈఓ తాహేరా సుల్తానా

పెనమలూరు: విద్యార్థులు చక్కటి ప్రణాళికలతో పబ్లిక్ పరీక్షలకు సిద్ధంకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి తాహేరా సుల్తానా సూచించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఈఓ తాహేరా సుల్తానా మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ప్రతిభ చూపి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి సబ్జెక్టుపైనా పట్టుసాధించాలన్నారు. ఉపాధ్యాయుల సూచనలతో చక్కటి మెలకువలతో పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ప్రణాళికలు రూపొందించి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.కనకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని వై.దుర్గాభవాని పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ తాహేరా సుల్తానా

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేయాలి

కంకిపాడు: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు సూచించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాకీ బాబు మాట్లాడుతూ. జెడ్పీ పాఠశాలల్లో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యం కావాలన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమర్థంగా వ్యవహరించాలని, విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పక్కన ఎంపీపీ రాజ్యలక్ష్మి తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

గన్నవరం రూరల్: భూమికి కావాల్సిన పోషకాలను ప్రకృతి పరంగా తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీపీ ఎం.సులోచన సూచించారు. మండలంలోని కొండపావులూరు గ్రామంలో నవధాన్యాల సాగుతో విత్తన గుళికలు తయారు చేసే విధానంపై స్థానిక రైతులు, మహిళలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌డీపీ సులోచన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పంట చేలు ఖాళీగా ఉంటే ఎకరానికి 11 కిలోలు నవధాన్యాలు చల్లుకోవాలని సూచించారు. 32 రకాల ధాన్యాలు వీటిలో ఉంటాయన్నారు. పైకి ఎదిగిన పంట బలవర్ధకమైన పశువుల గ్రాసంగా ఉపయోగపడుతుందని, భూమిలోనికి వెళ్లిన వేర్లు భూమి సారవంతానికి తోడ్పడతాయని వివరించారు. సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది సారవంతమైన భూములుగా పంట భూములను తయారు చేసుకునేందుకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుందన్నారు. విత్తన గుళికలను తయారు చేయడం కారణంగా గింజలు పొట్లిపోకుండా, పక్షులు, పురుగులు తినకుండా ఉంటాయని, ప్రతి విత్తనం మొలకెత్తుతుందని సూచించారు. ఐసీఆర్‌పీ తుమ్మల రాయప్ప, వీఓఏ చంద్రిక, గణేశ్వరమ్మ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మానవతకు దాతల భూమి విరాళం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ కార్యాలయం నిర్మాణానికి దాతలు విలువైన స్థలాన్ని విరాళంగా అందించటం అభినందనీమని సంస్థ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులో జాతీయ రహదారిని అనుకుని ఉన్న రూ.35 లక్షల విలువైన రెండు సెంట్ల స్థలాన్ని జన్యావుల సీతారామయ్య, రంగమ్మ దంపతుల జ్ఞాపకార్థం ఆయన కుమారులు కొండలరావు, గాంధీ, మనములు మానవత సంస్థకు అందజేశారు. ఈ భూమిలో దాతల సహకారంతో రూ.20 లక్షతో నిర్మించే కార్యాలయానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. దాత కుటుంబ సభ్యులను మానవత సంస్థ ఘనంగా సత్కరించింది. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, సీనియర్ సభ్యులు ఘంటా సత్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ, నారగాని కొండలరావు, పొట్లూరి శేషాచలం, వడ్డీ రాజేశ్వరరావు, డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, జి.జయరామచంద్రరావు పాల్గొన్నారు.



మానవత కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న మారుబోయిన కోటేశ్వరరావు

పెంచిన వంట గ్యాస్ ధర తగ్గించాలి

పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ అధ్యక్షురాలు షేక్ వల్లిమా, జిల్లా కమిటీ సభ్యురాలు జయలక్ష్మి డిమాండ్ చే శారు. యనమలకుదురులో శుక్రవారం గాంధీబొమ్మ వద్ద గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో గ్యాస్ బండలతో ప్రదర్శన చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి న తరువాత గ్యాస్ బండ ధర రూ.600 నుంచి రూ.1200కు పెరిగిందని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం గద్దెదిగే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఐద్వా పట్టణ కమిటీ కార్యదర్శి పాతాళలక్ష్మి, రంగనాయకమ్మ, టి.పద్మావతి, షేక్ ఖాసీంబీ, రమణమ్మ పాల్గొన్నారు.

బుద్దవరంలో..

బుద్దవరం(గన్నవరం): పెంచిన గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం తగ్గించే వరకు పోరాటం చేస్తామని ఐద్వా జిల్లా నాయకురాలు మల్లంపల్లి జయమ్మ పేర్కొన్నారు. మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా కట్టెల పొయ్య మీద వంట చేస్తూ శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ప్రజలపై భారాలు వేయడమే పనిగా బీజేపీ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు.



యనమలకుదురులో నిరసన తెలుపుతున్న ఐద్వా బాధ్యులు

జొన్నకు రెండో దఫా యూరియా వద్దు

నున్న(విజయవాడరూరల్): రబీ జొన్న సాగులో రెండో దఫా యూరియా వాడొద్దని వ్యవసాయ సిబ్బంది సూచించారు. వాడిన పొలాలు తెగుళ్లబారిన పడతాయని హెచ్చరించారు. నున్న గ్రామంలోని ఆర్‌బీకేలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సిబ్బంది హిమబిందు, మౌనిక మాట్లాడారు. వరి పైరులో అగ్గితెగులు కనిపిస్తున్నందున, నివారణకు ట్రైసైక్లోజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ సలహా మండలి చైర్మన్ పోలారెడ్డి రమేష్‌రెడ్డి, సభ్యులు వెంకటరెడ్డి, యలమర్తి మరియదాసు, అంగజాల శ్రీనివాసరావు, గుడిసే వాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరానికి శంకుస్థాపన

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని యాదవుల రామాలయం ఆవరణలో శ్రీకృష్ణ మందిరం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. తొలుత ఆలయ అర్చకుల నేతృత్వంలో పూజలు జరిగాయి. అనంతరం యాదవ సంఘం అధ్యక్షుడు సర్నాల రమేష్ నేతృత్వంలో భూమిపూజ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిమట రామారావు, మందిర నిర్మాణ కమిటీ సభ్యులు, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అర్జునుడు మృతికి ఎమ్మెల్యే సంతాపం

గన్నవరం: శాసనమండలి సభ్యుడు బచ్చుల అర్జునుడు మృతికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన రాజకీయ శైలి, వాగ్ధాటి ఎన్నటికీ మరువలేనిదని పేర్కొన్నారు. అర్జునుడు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 20 మందికి ఉద్యోగాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని ఎస్సార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన మెడి అసిస్ట్ పీపీఏ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ విద్యార్థినులకు క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించింది. ఈ సెలక్షన్స్‌లో 81 మంది విద్యార్థినులు పాల్గొనగా 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బృంద చర్చలు, సాంకేతిక పరిజ్ఞానం పరిశీలన, ముఖాముఖి భేటీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత మాట్లాడుతూ.. ప్రస్తుతం ఔషధ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొ న్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు రుచికర భోజనం అందించాలి

ఉంగుటూరు: పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని ఎంపీడీఓ జి.ఎస్.వి.శేషగిరిరావు సూచించారు. లంకపల్లి ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీడీఓ పేర్కొన్నారు. బడి పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో రుచికరమైన వంటకాలతో జగనన్న గోరుముద్దను వడ్డిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం మెను అమలును పరిశీలించారు.

రోడ్ల అభివృద్ధికి రూ.20 లక్షల మంజూరు

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలులో పలు అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ జి.ఎస్.వి.శేషగిరిరావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పర్యటనలో గుర్తించిన పలు పనులకు ప్రత్యేక నిధులు కేటాయించారని పేర్కొన్నారు. తొలిదశలో ఐదు అంతర్గత రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

గాయపడిన వృద్ధుడి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

పెనమలూరు: తలపై గడ్డిమోపు వెళ్తున్న వృద్ధుడు ప్రమాదవశాత్తు కిందపడి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులకథనం మేరకు.. పోరంకిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో కోటా వెంకటేశ్వర్లు (70) గేదల వద్ద పనీ చేస్తాడు. అతను గత నెల 27వ తేదీన పాఠశాల వెనుక ఉన్న గడ్డి కోసి మోపుగా కట్టి తలపై పెట్టుకుని నడిచి వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. అపస్మారకస్థితికి చేరిన వృద్ధుడిని అతని కుమారుడు కె.రాధాకృష్ణ గంటూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

పెనమలూరు: వివాహిత అదృశ్యమైందని ఆమె భర్త ఫిర్యాదు చేయడంతో పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. మండలంలోని తాడిగడప కాలువ కట్టకు చెందిన మేడూరి దీక్ష, వినోద్‌కుమార్ భార్యాభర్తలు. వినోద్‌కుమార్ న్యూఆటోనగర్‌లో పనిచేస్తాడు. ఈ నెల ఒకటో తేదీన దీక్ష ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వధూవరులుగా ఉత్సవమూర్తులు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న 260వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ఉత్సవ మూర్తులను వధూవరులుగా అలంకరించారు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం మనువడు, మనువరాలు అనీష్, లక్ష్మీ కామేశ్వరీలు దేవేరులకు నూతన వస్త్రాలను సమర్పించగా, అర్చకులు పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ, పెనుమూడి బాబురావు స్వామి వార్లను పెళ్లి కూతురు, పెళ్లి కొడుకుగా అలంకరించారు.